# నువ్వు చచ్చిపోతే...

ఏడుస్తున్నారు. ఆ ప్రదేశమంతా ఏడుపులతో దద్దరిల్లిపోతోంది. రకరకాల మనుషులు- రకరకాల యేడుపులు. ముసలివాళ్ళు ధైర్యంగా పెద్దగా యేడుస్తున్నారు. వయసులో వున్నవాళ్ళు బిడియపడకుండా చిన్నగా ఏడుస్తున్నారు. మధ్య మధ్యలో ముక్కులు పిందుతున్నారు. కళ్ళు తుడుచు కుంటున్నారు.

పైడిరాజు శవాన్ని వేపచెట్టు కింద పడుకోబెట్టారు. గుండెల మీద వరకూ తెల్లని గుడ్డ కప్పారు. పైడిరాజు కళ్ళు కొంచెం తెరుచుకుని వున్నాయి. ఆయన కళ్ళలో నించి పోయిందట ప్రాణం. ఆకాశం లోకి చూస్తున్నట్టున్నాడు పైడిరాజు.

ఆయన భార్య శకుంతలమ్మ- పైడిరాజు తలదగ్గర కూర్చుంది. ఆమె పెద్దకొడుకు విశ్వనాథం తండ్రి భుజాల దగ్గర కూర్చున్నాడు. అతని పెద్ద చెల్లెలు కస్తూరి- పైడిరాజు నడుము దగ్గర కూర్చుంది. ఇంకో కొడుకూ- కూతురూ ఏదో దూర ప్రాంతంనించి రావాలిట. వాళ్ళిద్దరికీ కొంచెం చోటువదిలి మిగిలిన బంధువులందరూ వరుసగాకూర్చుని వెనక్కి- ముందుకి వూగుతూ పైడిరాజు శవంమీద వాలుతున్న ఈగలను తోలుతూ ఏడుస్తున్నారు.

ఆరోజు- ఆ వూరు వూరంతా అక్కడే వుంది. మరెవరైనా చచ్చిపోతే అంతమంది వచ్చేవాళ్ళు కాదేమో ! కానీ- చచ్చిపోయింది పైడిరాజు. ఎన్నో ఏళ్ళనించీ ప్రెసిడెంటుగా ఆ వూరును యేలుతున్న మకుటంలేని మహారాజు. అందుకే అంతమంది వచ్చారు. వచ్చి వాళ్ళం

దరూ పైడిరాజు మృతదేహాన్ని చూశారు. అసలు ప్రాణం ఎలాపోయిందని చివరికి అడిగారు. గుండె ఆగిపోయిందట- అని ఎవరో చెప్పారు ఏడుపు వాల్యూమ్ తగ్గించి.

మిట్ట మధ్యాహ్నం.

బతికున్నప్పటి పైడిరాజు ఠీవిలా ఎండ మండుతోంది. నడి వేసవికాలం. చెట్టు నీడన గుంపులుగా నిల్చుని పైడిరాజు గొప్పతనం ఇంకా మంచితనం గురించి చెప్పుకుంటున్నారు మనుషులు.

"ఆ మాయదారి దేవుడు నన్నెత్తుకు పోయినా బావుండేదిరా నాయనోవ్. ఎంతపని చేశావురా దేవుడా ? దేవుడులాంటి ఆయన్ని ఎత్తుకు పోయావు గదరో" అంటూ దారుణంగా, వికృతంగా శోకాలు పెడుతూ ఏడుస్తోంది పైడిరాజు చేసుకున్న పెళ్ళాం శకుంతలమ్మ.

పైడిరాజులో యేకొంచెం ప్రాణంవున్నా భార్య మాటలకు లేచి కూర్చునేవాడే. ఎందుకంటే పైడిరాజు- శకుంతలమ్మను పెట్టిన కష్టాలకు అంతులేదు.

పెళ్ళయినా ఏడాదివరకూ శకుంతలమ్మ-పైడిరాజుతో స్వర్గాన్ని అనుభవించింది. ఆ తర్వాత నించే ఆమెకు ప్రతిరోజూ నరకాన్ని చూపించేడు పైడిరాజు. ఆ వూరు ఎలిమెంటరీ స్కూలుకు ఆ యేడే టీచర్‌గా వచ్చింది కనకం. పైడిరాజు కన్ను కనకం మీద పడింది. వల వేశాడు. ఆమె చిక్కుకుంది. కనకం వలలో ఆనక పైడిరాజు ఇరుక్కుపోయాడు. అరోజు నించీ పైడిరాజు మకాం కనకం ఇంట్లోనే. అప్పట్నించే శకుంతలమ్మకు కష్టాలు మొదలైనాయి. రోజు మొత్తం మీద ఒక్కసారి ఇంటికి వచ్చేవాడు పైడిరాజు. ఓ పది నిముషాలుండి కనకం ఇంటికి బయల్దేరేవాడు. శకుంతలమ్మ అడ్డుపడేది. కనకం ఇంటికి వెళ్ళొద్దని బతిమిలాడేది. తర్వాత ప్రాధేయపడేది పైడిరాజు

వినేవాడు కాదు. శకుంతలమ్మను చావబాది మీసాలను తిప్పుకుంటూ వెళ్ళిపోయేవాడు. మొగుడితో విసిగిపోయిన శకుంతలమ్మ పుట్టింటికి ప్రయాణమయింది- ఆ నరకాన్ని భరించలేక. కాని పైడిరాజు భార్యని గడప దాటనివ్వలేదు. కాలు బయటపెడితే ప్రాణం తీస్తానని బెదిరించాడు. ఇంట్లోనే ఖైదు చేశాడు. ఖైదులో వుండే యాంత్రికంగా పిల్లలను కన్నది శకుంతలమ్మ. పిల్లలు పెరిగినా శకుంతలమ్మ స్థితి మారలేదు.

అలాంటి శకుంతలమ్మ ఈరోజు పైడిరాజు బదులు తను చచ్చిపోయినా బావుండేదంటోంది.

నిజంగా పైడిరాజు చావకుండా వుంటే ?

దిక్కుమాలిన సూర్యుడు పరుగులు దీస్తున్నాడు రేసుగుర్రంలా-

ఏడ్చేవాళ్ళలో శక్తి నశించి పోతోంది. దాహమైనప్పుడల్లా నీళ్ళు తాగి మరీ ఏడుస్తున్నారు ఓపిక చేసుకుని.

అందరూ పైడిరాజు రెండో కొడుకూ, కూతురి కోసం ఎదురు చూస్తున్నారు. త్వరగా వస్తే బావుండు. శవాన్ని తిసుకు పోవచ్చు. ఎందాకా ఏడ్చివస్తాం? అని ఆత్రుత పడుతున్నారు ఏడుస్తున్నవాళ్ళంతా-

శవానికి కొంచెం దూరంగా కూర్చుని చుట్టలు కాల్చుకుంటున్న నలుగురు పెద్ద మనుషుల్లో ఒకాయన పైడిరాజుకేసి చూస్తూ "మంచివాళ్ళు ఎక్కువకాలం బతకరంటారు. ఇదేనే మో- లేకపోతే పైడిరాజు గారు పోవటం యేమిటి? ఈ వూళ్ళో ఆయన మాటకు ఎదురు లేదు. అందుకే ఆయన పోటీలేకుండా ఇన్నేళ్ళనించీ ప్రెసిడెంటవుతున్నాడు" అన్నాడు.

మిగిలిన ముగ్గురూ ఆయనకేసి ఆశ్చర్యంగా చూశారు. ఎందుకంటే పైడిరాజు పోటీ లేకుండా ఎలా ప్రెసిడెంటవుతున్నాడో వూళ్ళో అందరికీ తెలుసు.

ప్రెసిడెంటు ఎన్నికల్లో నిలబడ్డప్పుడు పైడిరాజుకు ముప్ఫయ్యేళ్ళు. పైడిరాజుకు ఆయేడే తండ్రి పోయేడు. ఆస్థంతా అతని చేతుల్లోకి వచ్చింది. అతని ప్రక్కనే ఎప్పుడూ ఓ పదిహేనుమంది స్నేహితులుండేవాళ్ళు. వాళ్ళు పైడిరాజును ఎన్నికల్లో నిలబడమన్నారు. పైడిరాజుకు పోటీగా మరోవ్యక్తి నిలబడ్డాడు. అతనికి బాగా పలుకుబడి వుంది. ఆయన గెలవటంలో ఎటువంటి అనుమానమూ లేదని పైడిరాజుకు తెలుసు. అందుకే అతన్ని మర్యాదగా పోటీనించి తొలగిపొమ్మని తన మనుషుల చేత చెప్పించాడు. కాని అతను వినలేదు. ఫలితంగా ఆరోజు ఆయన పక్కవూరికి వెళ్ళి తిరిగివస్తుంటే ఎవరో ఆయన తల పగలగొట్టారు. ప్రాణం పోయిందనే అనుకున్నారు. కాని ఆయన బతికాడు. ఐతే మళ్ళీ ఎన్నికల్లో నిలబడలేదు.

ఆ యేడు పైడిరాజు ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యేడు. తర్వాత కూడా మరోసారి అలాగే జరిగింది.

అప్పట్నించీ ప్రెసిడెండు ఎన్నికల్లో పైడిరాజుకు పోటీ లేదు. పైడిరాజు పోటీగా నిలబడి బుర్ర బద్దలు కొట్టించుకోటానికి ఎవరూ సాహసించలేదు. ఇది నలుగురికీ తెలిసిన రహస్యం.

రోడ్డుమీద జట్కా ఆగింది. అందులో నించి దిగింది పైడిరాజు రెండో కూతురు గిరిజ పెట్టాబేడా తీసుకొని. దిగటంలోటే ఒక్కవుదుట్న పరిగెత్తుకుంటూ వచ్చి తనకై ప్రత్యేకించిన ఖాళీలో కూర్చుని "నాన్నా" అంటూ ఆయన గుండెలమీద కూలబడి పోయింది. పైడిరాజు బతికున్నట్టయితే ఆ కుదుపుకు "అబ్బా" అనేవాడు.

గిరిజ రావటంతో ఏడుపుల స్థాయి మళ్ళీ పెరిగి పోయింది. అందరూ శ్రుతి పెంచారు.

"ఎంత ఘోరం జరిగింది నాన్నా....దేవుడెంత ద్రోహంచే శాడు? మాకెంత అన్యాయం చేశావు నాన్నా ? మమ్మల్నెంత గారాబంగా పెంచావు నాన్నా?" అంటూ నోరు ముయ్యకుండా ఏడుస్తోంది గిరిజ ముందే ప్రిపేరయి వచ్చినట్టు.

మరో సమయంలో ఐతే గిరిజ తల్లి శకుంతలమ్మ "అదేమిటే తల్లీ.... మీమాట మీనాన్న ఎన్నడూ కాదనలేదా ?" అని నిలదీసి అడిగేదే.

ఎందుకంటే- గిరిజ సినిమాలో లాగా ప్రభాకర్‌ని ప్రేమించింది. అతను ఓ సన్నకారు రైతు కొడుకు. ఐతేనేం ? అందమైన వాడు. గిరిజతో కాలేజీలో చదువుతున్నవాడు. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. ఈ విషయాన్ని తండ్రితో చెప్పింది గిరిజ. పైడిరాజు మొదట షాక్ తిన్నాడు. తర్వాత ఇలాగ జరగటానికి వీల్లేదన్నాడు. గిరిజ ఏడ్చింది. తన శవాన్ని చూడాల్సి వస్తుందన్నది.

సరేనన్నాడు పైడిరాజు.

ఆ మూడో రోజు ప్రభాకరం ఎవ్వరికీ కనిపించలేదు. ఆతర్వాత నాలుగు రోజులకు ప్రభాకర్ శవం బందరు లాకుల దగ్గర తేలింది. పైడిరాజు గర్వంగా మీసాలను మెలివేశాడు. తర్వాత ఈ విషయం అందరితో పాటు గిరిజక్కూడా తెలిసింది. కుమిలి యేడ్చింది. తండ్రి దుర్మార్గాన్ని ద్వేషించింది.

అలాంటి గిరిజ ఈరోజు ఇలా-

సూర్యుడు కిందికి దిగిపోతున్నాడు. ఎండ కరిగి పోతోంది. అవతల బ్రాహ్మలు తొందర పెడుతున్నారు- చీకటి పడితే దహనం చెయ్యకూడదని.

"చిన్న కొడుకు వచ్చేవరకు శవాన్ని వుంచకూడదు. సూర్యాస్తమయం కాకముందే శవాన్ని లేవదీయాలి" అన్నారు. అందుకు అందరూ తలలు వూపేరు.

నిమిషాల మీద పనులు మొదలైనాయి. వెదురు బద్దలు- తాళ్ళు తీసుకొచ్చారు. పాడె తయారవుతోంది.

ఏడుపు ఆపి అంతా రెస్ట్ తీసుకుంటున్నారు.

అప్పుడే ఏదో పూర్నించి వచ్చిన ఒక రైతుకు పైడిరాజు పోయేడని తెలిసింది. ఇంకేముంది? పరిగెత్తుకుంటూ అక్కడికి వచ్చేడు. కొంచెంసేపు శవాన్ని చూసి పక్కనున్నాయనతో "పైడిరాజు అదృష్టవంతుడయ్యా. పెద్దతనంలో మంచాన పడకుండా తిరుగుతూనే పోయాడు. ఎంత మందికి ఆ భాగ్యం? ఏమైనా ఆయన చేసుకున్న పుణ్యం ఏమవుతుంది ? ఎంతమంది బీదపిల్లలకు పెళ్ళిళ్ళు చేశాడు ?" అంటున్నాడు.

ఇది విని ఆయన పక్కనే వున్నాయన 'ఓరి నీనోరు పడిపోనూ' అన్నట్టు చూశాడు.

'ఎందుకు' అన్నట్టు చూశాడీయన.

'ఎందుకేమిటి ? నా కూతురు ఎందుకు చచ్చిపోయిందో నీకు తెలియదూ ?'

'తెలిస్తే మాత్రం ఇప్పుడు పైడిరాజు చచ్చిపోయేడు గదా. మనం ఆయన గురించి మంచిగానే చెప్పాలోయ్'

ఇంతకీ ఆయన కూతురు ఎందుకు చచ్చిపోయిందండీ ?

ఆయన కూతురు సుశీలకు పెళ్ళి నిశ్చయమయ్యింది. అందుకని ఆయన పైడిరాజు దగ్గరకు సహాయం చెయ్యమని అడగటానికి వచ్చాడు. పైడిరాజు తగిన సహాయం చేస్తానని మాట ఇచ్చాడు.

ఆ మరురోజు పైడిరాజు పొలంనుంచి తిరిగి వస్తూ సుశీల గుడిసెలోకి వెళ్ళాడు. తండ్రి అక్కడ లేడు. తల్లి చిన్నతనం లోనే పోయింది. ఒంటరిగా వుంది సుశీల. మంచి అవకాశం దొరికిందను కున్నాడు పైడిరాజు. తన గొప్పతనాన్ని సుశీల ముందు చిత్రించి ఒప్పుకో మన్నాడు. కాని సుశీల ఒప్పుకోలేదు అతను చెప్పినట్టు వింటానికి. 'అన్యాయం- నీ కూతురు లాంటిదాన్ని ఇలా కోరటం' అన్నది. 'నేనిన్ను కన్నానుటే పిల్లా' అన్నాడు పైడిరాజు బలత్కారానికి పూనుకుంటూ. తన కోరిక తీర్చుకున్నాడు. ఆ రాత్రే సుశీల శవం ఓనూతిలో తేలింది.

ఇలాంటి ఘోరాలు ఇంకెన్నో చేశాడు పైడిరాజు. ఐనా ఈరోజు పైడిరాజు పుణ్యాత్ముడు.

పాడె సిద్ధమయింది. పైడిరాజు శవాన్ని పాడెమీద పడుకోబెట్టి గట్టిగా బిగించారు మళ్ళీ లేస్తాడేమో నన్నట్టు. బంధువులు నలుగురు నడుములకు గుడ్డలు బిగించి పాడెకు నాలుగు వైపులా నిల్చున్నారు యోధుల్లాగా-

అంతా పైడిరాజును చివరి చూపు చూశారు. ఆయన భార్య, పిల్లలు, బంధువులూ పైడిరాజు శవానికి నమస్కారాలు చేశారు వదిలి పోతున్నందుకు-

ఇంకా చీకటి పడలేదు.

పాడె కదిలింది. పైడిరాజు శవం పైకి లేచింది.

మళ్ళీ యేడుపులు చెలరేగాయి.

"పుణ్యాత్ముడు. మహారాజులా వెళ్ళిపోతున్నాడు" అన్నారు యేడుస్తూనే-

శవంగా మారిన పైడిరాజు మాత్రం 'ఈ మనుషులు ఎంత పిచ్చి వాళ్ళు? ఇంత దుర్మార్గుడ్ని పట్టుకుని పుణ్యాత్ముడంటున్నారు. నేను మంచివాడినా ? ఐనా ఇదీ బానేవుందిలే' అని ముసిముసిగా నవ్వు కున్నాడు పాడెమీద చచ్చిన దర్జాలో ఠీవిగా పూరేగుతూ.

*

(17-7-77 ప్రజాతంత్ర వారపత్రిక)